ఓ లుక్కేయండి సారూ..

• సమస్యలు చిన్నవే..తీర్చేదెవరు..? • పరిష్కారంపై అధికారుల నిర్లక్ష్యం • ప్రజల అవస్థలు



చిన్న చిన్న సమస్యలపై అధికారులు ఎప్పటికప్పుడు దృష్టి సారిస్తే ఒక్కొక్కటిగా పరిష్కారమవుతాయి. అధికారులు, ప్రజాప్రతినిధులు అప్పుడప్పుడు కాలనీలు, బస్తీలలో పర్యటిస్తున్నా వీటిని పట్టించుకోవడం లేదని పలు కాలనీల ప్రజలు ఆరోపిస్తున్నారు. దీంతో తాము అవస్థలు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉన్నతాధికారులు జోక్యం చేసుకుని. గచ్చిబౌలి డివిజన్‌లోని పలు కాలనీలు, బస్తీలలో నెలకొంటున్న చిన్నచిన్న సమస్యలు పరిశీలించాలని కోరుతున్నారు

– రాయదుర్గం

రోడ్డు తవ్వి వదిలేశారు

పైప్‌లైన్ వేయడానికి రాయదుర్గంలో అంతర్గత రోడ్డును తవ్వారు. పైప్‌లైన్ వేశారు. ఆ తర్వాత అంతర్గత రోడ్డును సీసీరోడ్డుగా మార్చడం అధికారులు మర్చిపోయారు. దీంతో మట్టిరోడ్డులో నిత్యం అవస్థల పాలవుతున్నామని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మంచినీటి, డ్రైనేజీ పైప్‌లైన్లు వేసిన తర్వాత వెంటనే ఆ రోడ్డును సీసీరోడ్డుగా వేయడం అంతటా జరుగుతోంది. కానీ ఇక్కడ మాత్రం పైప్‌లైన్ వేసి చేతులు దులుపుకున్నారని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వెంటనే సీసీరోడ్డుగా మార్చాలని డిమాండ్ చేస్తున్నారు.



సీసీరోడ్డు వేయాలి



రాయదుర్గంలోని అంతర్గత రోడ్డును సీసీరోడ్డుగా మార్చాలి. గత కొన్ని నెలల క్రితం పైప్‌లైన్ వేయడానికి అంతర్గత రోడ్డును తవ్వి పనులు పూర్తి చేసి మట్టిని చదును చేసి చేతులు దులుపుకున్నారు. వెంటనే సీసీరోడ్డు వేయాలి. ఆ దిశగా అధికారులు చర్యలు తీసుకోవాలి.

– ఎస్ బలరామ్, రాయదుర్గం

సిమెంట్ స్తంభాలు ఏర్పాటు చేయాలి

రాయదుర్గంలో పురాతన ఐరన్ విద్యుత్ స్తంభాలను ఏర్పాటు చేయాలి. అధికారుల దృష్టికి తెచ్చినా ఫలితం లేకుండా పోతోంది. వర్షాకాలంలో భయం, భయంగా వాటికి దూరంగా వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. కొన్ని చోట్ల నడకదారిలో కూడా ఐరన్ స్తంభాలు కొనసాగుతున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి వెంటనే సిమెంట్ స్తంభాలు వేయాలి

– నిఖిల్‌యాదవ్, రాయదుర్గం

సిమెంట్ పోల్స్ వేయాలి



రాయదుర్గంలోని పలు చోట్ల ఏళ్ల తరబడి ఐరన్ స్తంభాలు కొనసాగుతుండటంతో స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వర్షాకాలంలో ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కొన్ని చోట్ల కింద వరకు ప్లాస్టిక్ కవర్ ఏర్పాటు చేసినా మిగతా చోట్ల ఇళ్ళ ముందు, ప్రధాన రోడ్డు పక్కన, అంతర్గత రోడ్లపై ఈ స్తంభాలే కొనసాగుతున్నాయి, విద్యుత్ అధికారులు స్పందించి వెంటనే సిమెంట్ స్తంభాలు ఏర్పాటు చేసేలా చూడాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

ప్రమాదకరంగా విద్యుత్ స్తంభం

రాయదుర్గం ఎస్సీ బస్తీలో విద్యుత్ స్తంభం ప్రమాదకరంగా మారింది. ఇంటి ముంగిట ఉండడంతో అది ఎప్పుడు ఇంటిపై పడిపోతుందోనన్న ఆందోళన చెందుతున్నారు. అధికారుల దృష్టికి తెచ్చినా పట్టించుకోవడంలేదు. అనువైన చోటుకు విద్యుత్ స్తంభాన్ని తరలించాలని రాయదుర్గం ఎస్సీ బస్తీవాసులు కోరుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించాలని స్థానికులు కోరుతున్నారు.



ఇంటిపైన పడేలా ఉంది



రాయదుర్గంలో ళ్ల ముందు, నడకదారిలో ఇబ్బందికరంగా విద్యుత్ స్తంభాలతో నిత్యం ఇక్కట్లు పడుతున్నాం. మా ఇంటి ముందున్న స్తంభం మా ఇంటిపై పడే ప్రమాదం ఉంది. ఈ విషయాన్ని అధికారుల దృష్టికి తెచ్చినా పట్టించుకోవడంలేదు. వర్షాకాలం కావడంతో భయం వేస్తోంది. ఇప్పటికైనా వెంటనే విద్యుత్ స్తంభాన్ని తొలగించాలి.

– అనసూయ, రాయదుర్గం ఎస్సీబస్తీ



సిమెంట్ రోడ్డు వేయాలి



రాయదుర్గంలో ఇళ్ల మధ్యన ఉండే ఖాళీ స్థలంలో డ్రైనేజీ పైప్‌లైన్‌లు, మ్యాన్‌హోళ్లను ఏర్పాటు చేశారు. కానీ సీసీరోడ్డు వేస్తామని చెప్పి మూడేళ్లయినా ఇప్పటి వరకు వేయలేదు. నిత్యం ఇబ్బందులు పడుతున్నాం. వర్షం పడితే మ్యాన్‌హోల్ గాయాలవుతున్నాయి, వెంటనే సీసీరోడ్డు వేసేందుకు చర్యలు తీసుకోవాలి. – దుర్గారామ్, రాయదుర్గం ఎస్సీబస్తీ

పైప్‌లైన్ వేశారు.. సీసీ రోడ్డు వేయడం మరిచారు

రాయదుర్గంలోని ఎస్సీ బస్తీలో ఇళ్ల మధ్య ఉండే ఖాళీ స్థలంలో డ్రైనేజీ పైప్‌లైన్ వేశారు. కానీ పైప్‌లైన్ వేసేప్పుడు సీసీరోడ్డు వేస్తామని అధికారులు హామీ ఇచ్చారని స్థానికులు పేర్కొంటున్నారు. ఇళ్ల మధ్య ఉండే పైప్‌లైన్‌కు మధ్యమధ్యన ఉండే మ్యాన్ హోల్ ఏర్పాటు చేయడంతో రాకపోకలకు ఇబ్బంది పడుతున్నామన్నారు. మూడేళ్లుగా సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని కాలనీవాసులు ఆరోపిస్తున్నారు. వెంటనే సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.

విద్యుత్ అధికారుల సమాచారం

మియాపూర్:
హరి కృష్ణ – మియాపూర్ ఏడిఈ – 9491067497
రాజ్ కుమార్ – ఏఈ – 9440813169
ఫ్యూజ్ ఆఫ్ కాల్ – 9490153512
మయూరినగర్ సబ్ స్టేషన్
హరీష్‌సింగ్ – ఏఈ – 9491067510
ఫ్యూజ్ ఆఫ్ కాల్ – 7382019913

కూరగాయల ధరలు

శేరిలింగంపల్లి: నల్లగండ్ల మార్కెట్‌లో కూరగాయల ధరలు కిలో రూపాయల్లో... టమాట 50, పచ్చిమిర్చి 90, బెండ 50, కాకర 70, దొండ 30, దోస 40, ఆలు 40, చామ 60, కీర 35, బీర 70, వంకాయ 40, గోకర 70, బీన్స్ 140, బీట్‌రూట్ 50, క్యాప్సికమ్ 70, క్యాబేజీ 40, క్యారెట్ 70, చిక్కుడు 90, ఉల్లి 40(కేజీ), ములక్కాయలు (1)10 , క్యాలీఫ్లవర్ (1) 40, సొరకాయ (కేజీ) 20, అల్లం 180, వెల్లుల్లి 280.

'ఎంజా ఫర్నిచర్' ప్రారంభం



ఎంజా ఫర్నిచర్‌ను ప్రారంభిస్తున్న తిరుపతిరెడ్డి

రాయదుర్గం: ప్రపంచ స్థాయి ఫర్నిచర్ సేకరణలో ముందుండే 'ఎంజా ఫర్నిచర్' హైదరాబాద్ నాలెడ్జి సిటీలో బయోడైవర్శిటీ పార్కు సమీపంలో ఆదివారం ప్రారంభించారు. రాష్ట్ర సీఎం రేవంత్‌రెడ్డి సోదరుడు తిరుపతిరెడ్డి షోరూంను ప్రారంభించారు. విదేశాల వెళ్లకుండా ఇక్కడే ప్రపంచ స్థాయిలో గుర్తించే అన్ని రకాల ఫర్నీచర్‌తోపాటు ఉపకరణాలు, కళాఖండాలు అందుబాటులో ఉంటాయని నిర్వాహకులు తెలిపారు. ప్రసిద్ధ లగ్జరీ బ్రాండ్‌లు ఆఫర్లతోపాటు ఇటాలియా, బెంట్లీ, ఫెండికాసా, మినోట్టి, రాబర్టో కావెల్లి, వెర్సేస్, డేటోనాతో సహా ఎలైట్ గ్లోబల్ ఫర్నీచర్ బ్రాండ్‌లను అందుబాటులో ఉంచామన్నారు. కార్యక్రమంలో అనూష ఠాకూర్, సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

అ'పూర్వ' సమ్మేళనం



శేరిలింగంపల్లి: శేరిలింగంపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల (1999–2000) బ్యాచ్ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం నిర్వహించారు. పదో తరగతి బ్యాచ్‌కు చెందిన విద్యార్థులు 24 ఏళ్ల తరువాత కలిసి వేడుకగా కార్యక్రమాన్ని నిర్వహించారు. సమేళనానికి పూర్వ విద్యార్థులు 80మంది హాజరయ్యారు. ఏఏ ఉద్యోగాలు చేస్తున్నారో... కుటుంబ విషయాలను ఒకరిని, ఒకరు అడిగి తెలుసుకొని సంతోషం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సాంస్కృతిక కార్యక్రమాలతో ఆకట్టుకున్నారు. అప్పటి ఉపాధ్యాయులు వసంత, వర్ధమాల, గిరిజ, లక్ష్మీ, జయంత్‌కుమార్‌లను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో పూర్వవిద్యార్థులు హనుమంత్ నాయక్, రాజేష్, రమేష్, ఎల్లేష్, విజయ్, నర్సింగరావు, రాజ్‌కుమార్, చాముండేశ్వరీ, జానకి, లక్ష్మణరేఖ పాల్గొన్నారు. రాజేష్, అశోక్, మహేందర్, రాజు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న భరతనాట్య ప్రదర్శన



మాదాపూర్: కళాకారులు భరతనాట్య ప్రదర్శనతో సందర్శకులను ఆకట్టుకున్నారు. మాదాపూర్‌లోని శిల్పారామంలో నిర్వహిస్తున్న వారాంతపు కార్యక్రమాలలో భాగంగా ఆదివారం ఆర్కే ఎస్ కళా నిలయం గురువు సుందరి రవిచంద్ర శిష్య బృందంచే భరతనాట్య ప్రదర్శనతో సందర్శకులను అలరించారు. ఇందులో నృత్యాంజలి, గజాననయుతం, అలరిపు, పంచముఖికౌతం, భో శంభో, గోవర్ధన గిరిదారి, తక్కువేమి మనకు, అంబాశాంభవి, కళింగతిల్లాన తదితర అంశాలను ప్రదర్శించి అలరించారు. కళాకారులు నివేదిత, పావని, శ్రేయ, వరుని, ప్రవళిక, కిరణ్మయి, ఆద్విక, హాసిని, నిధి, అగర్త, గోద్విజ, తదితరులు ప్రదర్శించి అలరించారు.

మాదాపూర్ ఎస్‌హెచ్‌ఓగా డి.కృష్ణమోహన్



మాదాపూర్: మాదాపూర్ స్టేషన్ హౌస్ ఆఫీసర్‌గా డి.కృష్ణమోహన్ ఆదివారం రిపోర్టింగ్ చేశారు. మాదాపూర్ ఎస్‌హెచ్‌ఓగా ఉన్న గడ్డం మల్లేష్ జీడిమెట్ల పోలీస్‌స్టేషన్‌కు బదిలీ అయ్యారు.

సీవరేజ్ ప్లాంట్‌ను ప్రారంభించండి



ఎమ్మెల్యే గాంధీకి సమస్యలను వివరిస్తున్న టీఎన్‌జీఓ నాయకులు

రాయదుర్గం: రంగారెడ్డిజిల్లా టీఎన్‌జీఓ ప్రభుత్వ ఉద్యోగుల హౌసింగ్ వెల్ఫేర్ సొసైటీలో సీవరేజ్ ప్లాంట్ ప్రారంభించాలని సొసైటీ ప్రతినిధులు అన్నారు. ఈ మేరకు ఆదివారం వారు శేరిలింగంపల్లి ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీని కలిసి వినతిపత్రం అందజేశారు. కాలనీలో సీవరేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్ (ఎస్‌టీపీ) పనులు ప్రారంభం కాలేదని. ఏడాదిగా పురపాలక శాఖ అనుమతి కోసం ఎదురు చూస్తున్నామని ఎమ్మెల్యే దృష్టికి తెచ్చారు. ఈ విషయంపై పలుమార్లు డిప్యూటీ కమిషనర్ దృష్టికి తీసుకెళ్లామని, జలవనరుల శాఖ జనరల్ మేనేజర్ దృష్టికి తీసుకెళతామని ఆయన హామీ ఇచ్చారని అసోసియేషన్ నాయకులు తెలిపారు. కాలనీలో ఇప్పటికే ఒక్కొ క్కటిగా మౌలిక సదుపాయాలు ఏర్పడుతున్నాయని వారు పేర్కొన్నారు. కాలనీలో అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ వ్యవస్థ పనులు ముగింపు దశకు చేరుకున్నాయన్నారు. స్థానిక సమస్యలపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఎమ్మెల్యేను కోరినట్లు అసోసియేషన్ అధ్యక్షుడు గడ్డం జంగయ్య, ఇతర సభ్యులు పేర్కొన్నారు.

రొమ్ము కేన్సర్‌పై అవగాహన పెంచుకోవాలి



మాదాపూర్: రొమ్ము కేన్సర్‌పై మహిళలు అవగాహన పెంచుకోవాలని డాక్టర్ శరత్ రెడ్డి అన్నారు. మాదాపూర్‌లోని ఆవాస హోటల్‌లో ఆదివారం మెడికవర్ కేన్సర్ ఇనిస్టిట్యూట్ మహిళల అంకాలజీ గ్లోబల్ సమ్మిట్‌ను డాక్టర్ శరత్‌రెడ్డి, డాక్టర్ శాంత కుమారిలతో కలిసి ప్రారంబించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్త్రీ జననేంద్రియ, రొమ్ము కేన్సర్‌లపై అవగాహన, చికిత్సలను అభివృద్ధి చేయడానికి తీసుకుంటున్న అంశాలను సమ్మిట్‌లో చర్చించనున్నట్లు తెలిపారు. సమ్మిట్‌లో ఎండోమెట్రికల్, గర్భాశయ, రొమ్ము, అండాశయ కేన్సర్‌లపై చర్చించారు. మెడికవర్ డైరెక్టర్ డాక్టర్ సతీష్ కై లాసం, డాక్టర్ సరితా శ్రీవాస్తవ, డాక్టర్ అన్వేష్, పవన్, ప్రవీణ్, మీర్జాఅలీ, కార్తీక్, శ్రీరాం తదితర డాక్టర్లు పాల్గొన్నారు.

విద్యార్థుల ఆందోళన విరమణ



రాయదుర్గం: విద్యార్థులపై సస్పెన్షన్ విధించడంతో హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో విద్యార్థులు చేపట్టిన నిరసన కార్యక్రమాన్ని ఆదివారం విరమించారు. హెచ్‌సీయూలో ఆరు రోజులపాటు క్యాంపస్‌లోని నార్త్ షాపింగ్ కాంప్లెక్స్ సమీపంలోని వెలివాడ వద్ద నిరసన దీక్షలు చేపట్టిన విషయం తెలిసిందే. హెచ్‌సీయూ విద్యార్థి సంఘం అధ్యక్షుడు అతీక్, మాజీ అధ్యక్ష, కార్యదర్శులుసోహెల్, మోహిత్‌తోపాటు మరో ఇద్దరు ఆందోళన కొనసాగిస్తున్న విషయం తెలిసిందే. యూనివర్సిటీ అధికారులు విద్యార్థులతో చర్చించి సమస్యను పరిష్కరించేందుకు చొరవ తీసుకోవడంతో వివాదం సద్దుమణిగింది. సెస్పెన్షన్‌ను తొలగిస్తున్నట్లు అధికారులు ప్రకటించడంతో దీక్షలను విరమిస్తున్నట్లు ఎస్ఎఫ్ఐ హెచ్‌సీయూ కార్యదర్శి క్రిపామారియా జార్జ్ ప్రకటించారు. హెచ్‌సీయూ క్యాంపస్‌లో ఎప్పటికప్పుడు విద్యార్థుల సమస్యల పరిష్కారంపై పోరాటం నిరంతరం కొనసాగిస్తామన్నారు.

'టెనా' గ్రీన్ ఆర్మీ ఆధ్వర్యంలో క్లీనప్ డ్రైవ్

గోపన్‌పల్లి చెరువు పరిసరాల్లో నిర్వహణ



రాయదుర్గం: గేటెడ్ కమ్యూనిటీవాసులంతా ఏకమయ్యారు. అంతా కలిసి గోపన్‌పల్లిలోని చెరువు పరిసరాల్లో ఆదివారం క్లీనప్‌డ్రైవ్ కార్యక్రమాన్ని చేపట్టారు. గోపన్‌పల్లి పరిసరాల్లోని తెల్లాపూర్ నైబర్‌హుడ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో హనర్ ఆక్వాన్‌టీస్, బ్రిక్స్‌స్కైవుడ్, ముప్పా గ్రాండేయర్ గేటెడ్ కమ్యూనిటీలకు చెందిన వారంతా కలిసి 'టెనాగ్రీన్ ఆర్మీ' పేరిట ప్రత్యేక సంస్థ ఏర్పాటు చేసి గోపన్‌పల్లి చెరువు క్లీనప్ డ్రైవ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. చెరువు పరిసరాల్లోని చెత్తాచెదారం, వ్యర్థాలు, ప్లాస్టిక్ గ్లాసులు, కవర్లు, ఇతర వ్యర్థాలన్నింటిని తొలగించారు. తమ గేటెడ్ కమ్యూనిటీలకు చేరువలో ఉన్న చెరువు పరిసరాలు పరిశుభ్రంగా ఉండాలని భావించిన వారు దశలవారీగా క్లీనప్ డ్రైవ్ నిర్వహిస్తున్నారు.

చెరువును సుందరీకరించాలి



గోపన్‌పల్లిలోని చెరువును జీహెచ్‌ఎంసీ సుందరీకరించాలి. చుట్టూరా వాకింగ్ ట్రాక్, లైటింగ్ ఏర్పాటు చేస్తే ఎంతో పలు గేటెడ్ కమ్యూనిటీవాసులకు సేద తీరేందుకు అవకాశం ఏర్పడుతుంది. ముఖ్యంగా చెరువులోకి మురుగునీరు రాకుండా ఎస్టీపీ పైప్‌లైన్‌కు అనుసంధానం చేయాలి. పరిసరాల్లో పార్కులు ఏర్పాటు చేసేందుకు అనువైన స్థలం లేకపోవడంతో ఈ చెరువు పరిసరాల్లో ఆహ్లాదపూరిత వాతావరణం నెలకొనేలా చేస్తే ఇక్కడి వాసులకు ఎంతో ఉపయుక్తంగా మారుతుంది. క్లీనప్ డ్రైవ్ కార్యక్రమం తరచూ నిర్వహించేందుకు తగిన ప్రణాళిక రూపొందిస్తాం.

– రమణ ఈశ్వరగారి అధ్యక్షుడు, తెల్లాపూర్ నైబర్‌హుడ్ అసోసియేషన్



క్లీనప్‌డ్రైవ్ నిర్వహిస్తున్న గేటెడ్ కమ్యూనిటీవాసులు

కనుల విందుగా అనికా అరంగేట్రం



సాక్షి, సిటీబ్యూరో: నగరంలోని శిల్ప కళా వేదికగా జరిగిన నృత్యకారిణి అనికారావు సొదరి కూచిపూడి అరంగేట్రం ఆహుతులను విశేషంగా ఆకట్టుకుంది. ప్రముఖ నృత్య గురువులు రాజా–రాధా రెడ్డి, కౌసల్యా రెడ్డి, యామినీ రెడ్డి మార్గనిర్దేశంలో జరిగిన ఈ కార్యక్రమంలో అనికా సొదరి అలరించింది. కార్యక్రమంలో ప్రముఖ నాట్యగురువులు, రాజకీయ ప్రముఖులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా ఆర్థో వాకథాన్



వాకథాన్-2024ను ప్రారంభిస్తున్న కామినేని శ్రీనివాస్

రాయదుర్గం: స్టార్ ఆస్పత్రులు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లలో అతిపెద్ద జాయింట్ రిప్లేస్‌మెంట్, ఆర్థోపెడిక్ పేషెంట్ వాకథాన్‌ను నిర్వహించారు. ఆదివారం నానక్‌రాంగూడ ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్ ప్రాంతంలోని స్టార్ ఆస్పతి వద్ద స్టార్‌ఆర్థో 360వాకథాన్–2024 పేరిట ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో 250కి పైగా ఆర్థోపెడిక్, శస్త్ర చికిత్స అనంతర రోగులకు ఎముక, కీళ్ళ ఆరోగ్యం ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు. ఆంధ్రప్రదేశ్ మాజీ మంత్రి, కైకలూరు ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్ జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్టార్ ఆస్పత్రి ఆధ్వర్యంలో వాకథాన్ నిర్వహించడం అభినందనీయమన్నారు. ఏడాదిలో స్టార్ ఆర్థో 360 బృందం 1000కి పైగా చికిత్సలను విజయవంతంగా చేయడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు. రోగులు, ఆరోగ్య సంరక్షణ నిపుణులు, ఫిట్‌నెస్ ఔత్సాహికులతోసహా అన్ని వయస్సుల వారు ఈ వాకథాన్ పాల్గొన్నారన్నారు. స్టార్ ఆస్పత్రుల గ్రూప్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ మన్నం గోపీచంద్ మాట్లాడుతూ ఆరోగ్యం అనేది వ్యక్తిగత బాధ్యత అన్నారు. మనిషి శారీరకంగా చురుగ్గా ఉండడం, ఆరోగ్యకరమైన జీవనశైలి ఎంపికలు చేయడంతో సహా మన శ్రేయస్సును కాపాడుకోవడానికి మనలో ప్రతి ఒక్కరూ చురుకైన చర్యలు తీసుకోవాలన్నారు. అనేక దీర్ఘకాలిక వ్యాధులను నివారించవచ్చన్నారు. మన ఆరోగ్యంపై మనకున్న అధికారాన్ని గుర్తించి తదనుగుణంగా చర్యలు తీసుకోవడం అవసరమన్నారు. కార్యక్రమంలో ఆస్పత్రి ఆర్థోపెడిక్ సర్జన్ డాక్టర్ శశికాంత్,పలువురు వైద్యులు పాల్గొన్నారు.

చెత్త కుప్పలను తొలగించండి

మియాపూర్: మియాపూర్‌లోని పటేల్ చెరువు, గురునాథం చెరువు సమీపంలో చెత్త కుప్పలు దర్శనమిస్తున్నాయి. స్థానిక వాసులు, వ్యాపారస్తులు చెత్తను తీసుకువచ్చి కుప్పలుగా వేస్తున్నారు. అక్కడి నుండి తొలగించాల్సిన సిబ్బంది ఎప్పటికప్పుడు తొలగించకపోవడంతో గుట్టలుగా పేరుకుపోతున్నాయి. అధికారులు చెరువు సమీపంలో చెత్తను వేయకుండా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

దివ్యాంగులకు రాజకీయ రిజర్వేషన్లు కల్పించాలి

పటాన్‌చెరు టౌన్: దివ్యాంగులకు రాజకీయ రిజర్వేషన్లు కల్పించాలని నవభారత్ నిర్మాణ్ యువసేన జిల్లా అధ్యక్షుడు మెట్టు శ్రీధర్ అన్నారు. ఆదివారం పటాన్ చెరు మండలం ఇస్నాపూర్‌లోని ప్రభుత్వ పాఠశాలలో టీఎండీఏ(తెలంగాణ మస్కులర్ డిస్ట్రోఫీ అసోసియేషన్) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రవికుమార్ ఆధ్వర్యంలో ఈ విషయమై సమావేశాన్ని నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరై ఆయన మాట్లాడారు. అన్ని రంగాల్లో దివ్యాంగులకు సముచిత స్థానం కల్పించాలన్నారు. వారి హక్కులు, సమస్యల పరిష్కారం కోసం చట్టసభల్లో స్థానిక సంస్థల ఎన్నికల్లో రిజర్వేషన్లు కల్పించాలన్నారు. 2016 చట్టాన్ని పూర్తి స్థాయిలో అమలు పరచాలన్నారు. వారిని అన్ని విధాలుగా ప్రభుత్వం ఆదుకోవాలని డిమాండ్ చేశారు.